

# చిదంబర రహస్యం

- వాణిశ్రీ

సుబ్రమణ్యం పొలం గట్టుమీద నిల్చున్నాడు.

గట్టు మీదున్న తాడిచెట్ల నీడ పొట్టిగా మారిపోతున్నది.

కూలీలు చెమట కారుస్తూ పని చేస్తున్నారు.

వాతావరణం వేడెక్కుతోంది.

సుబ్రమణ్యం తలపైకెత్తి చూశాడు.

సూర్యుడు పైకి ఎగబాకుతున్నాడు.

నరసయ్య పరిగెత్తుకుంటూ రావడం చూశాడు సుబ్రమణ్యం.

వీడెందుకు వస్తున్నాడబ్బా! ఇంట్లో పని చెయ్యరా అంటే చేలోకెందుకు వస్తున్నాడు? ఏదైనా పని చెప్పారా?' అనుకుంటూ కళ్ళు చిట్లించి చూశాడు నరసయ్య వైపు.

"అయ్యగారూ! మీ కోసం ఎవరో వచ్చారండి. అమ్మగారు మిమ్మల్ని పిల్చుకురమ్మన్నారండి" అన్నాడు నరసయ్య రొప్పుతూ.

"ఎవర్రా వచ్చింది?"

"ఏమోనండయ్యా!"

"పేరు చెప్పలేదా?"

"ఊహూ..."

"నువ్వు చూశావా? ఎట్లా వున్నాడేం?"

"మీ అంత ఎత్తున్నాడండి. తెల్లటి బట్ట లేసుకున్నాడండి. నల్లటి బూట్లున్నాయండి" చెప్పాడు నరసయ్య.

సుబ్రమణ్యానికి ఏమీ పాలుపోలేదు.

వచ్చిందెవరో అర్థంకాలేదు. ఇటు చూస్తే చేలో కూలీలు పని చేస్తున్నారు. తనిక్కడ లేకపోతే వాళ్ళు పనిచెయ్యరు. చెట్ల నీడన చేరి చుట్టలు కాల్చుకుంటూనూ, పరాచకాలాడుకుంటూను, సొల్లుకబుర్లు చెప్పుకుంటూను కాలక్షేపం చేస్తారు.

వెళ్తే ఎట్లా?

వెళ్ళకపోతే ఎట్లా?

సుబ్రమణ్యం ఇరుకున పడ్డాడు.

"ఒరి వెధవా! ఆ వచ్చినాయన్ని ఇక్కడికి తీసుకురాగూడదా? నీ తెలివి తెల్లారిపోనూ! నేనిక్కడ చేలో పనిచేయిస్తానని నీకు తెలీదా?" అని విరుచుకుపడ్డాడు నరసయ్య మీద.

"నాకేం తెలుసండి? అమ్మగారు మిమ్మల్ని పిల్చుకురమ్మన్నారు. వచ్చా!!" అన్నాడు ముఖం చిన్నబుచ్చుకుని.

"సరే! పద వస్తున్నా" అన్నాడు విసుక్కుంటూ.

నరసయ్య పరుగు లంకించాడు.

సుబ్రమణ్యం ఇంటికి వెళ్ళేసరికి విశ్వనాథం వరండాలో కూర్చుని పేపరు చదువుతూ కనిపించాడు.

"విశ్వనాథం! నువ్వా! ఎవరో అనుకున్నాను" అన్నాడు అతన్ని పలకరిస్తూ.

సుబ్రమణ్యం, విశ్వనాథం డిగ్రీలో క్లాస్ మేట్లు. విశ్వనాథం డిగ్రీ పాసై ఆ పై చదువులు చదివి వుద్యోగంలో చేరిపోయాడు. సుబ్రమణ్యం డిగ్రీ గట్టెక్కలేక కులవృత్తినే నమ్ముకున్నాడు.

విశ్వనాథం చిరునవ్వు నవ్వాడు.

"ఏమిటి మా పల్లెటూరికి దయచేశావు? పొలం ఏమైనా కొంటావా?" అడిగాడు సుబ్రమణ్యం.

"పొలం కొనడమా నా బొందా? ఉన్న పొలాన్నే అమ్ముకున్నాను ఆ తలనెప్పి భరించలేక" అని నవ్వాడు విశ్వనాథం.

"ఊరక రారు మహాత్ములని ఏమిటి విశేషాలు?" అన్నాడు సుబ్రమణ్యం.

"చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకుగాని నీతో ముఖ్యమైన పని పడిందోయ్! అందుకే వచ్చాను."

"ఏమిటో చెప్పు. నాకు చేతనైతే చేస్తాను."

"అది నీ వల్లనే అవుతుంది. నన్ను హైదరాబాద్ ట్రాన్సఫర్ చేయించాలి. మంత్రిగారికి నువ్వు చెప్తే తిరుగుండదు" అన్నాడు విశ్వనాథం.

"ఓస్ ట్రాన్సఫరేగా! తప్పకుండా చేయిద్దాం. హైదరాబాద్‌లో నీ పోస్టులు ఖాళీగా వున్నాయా? ఎంక్వయిరీ చేసి వచ్చావా?" అడిగాడు సుబ్రమణ్యం.

"అదంతా ఎంక్వయిరీ చేసే వచ్చాను. ఖాళీలు వున్నాయి."

"సరేనోయ్! విశ్వనాథం. నాకు రెండు, మూడు రోజులు టైట్‌గా వుంటుంది. చేలో పని చేయిస్తున్నాను. ఆ పని పూర్తికాగానే వెళ్దాం."

"వీలైనంత త్వరగా వెళ్ళాలోయ్ మనం. ఎందుకంటే ఇది ట్రాన్సఫర్ల సీజన్. ఆలస్యం చేస్తే ఎవడో ఒకడు తన్నుకు పోతాడు" అన్నాడు విశ్వనాథం.

"అలాగే! సోమవారం వెళ్దాం. సరేనా!"

"సోమవారమంటే ఇంకా నాలుగు రోజులుంది. ఈ లోపల కుదరదా!"

"లేదోయ్! ఇక్కడ నేను లేకపోతే కష్టం. మా నాన్న పోయాక అంతా నా మీద పడింది."

"సరే! నేను సోమవారం వస్తాను" అని వెళ్ళడానికి తయారయ్యాడు విశ్వనాథం.

సుబ్రమణ్యం అతన్ని కదలనీయలేదు. భోజనం చేసిగాని వెళ్ళడానికి వీల్లేదన్నాడు.

***

స్నేహితులిద్దరూ లకిడీకాపూల్ ప్రాంతంలో ఒక హోటల్లో దిగారు.

మృత్యుంజయరావు సుబ్రమణ్యానికి చిన్నతాత కొడుకు. చిన్నాన్న అవుతాడు. గ్రామ సర్పంచ్ నుంచి అంచెలంచెలుగా




"మీరొచ్చే ముందరే నన్నొక మనిషి ముద్దు పెట్టుకోబోయాడు" అంది కమల

"వాడి చెంప పగలకొట్టాల్సింది!" అన్నాడు శ్రీనివాస్.

"కొట్టాను. ముద్దు పెట్టుకున్నాక" చెప్పి నాలిక కరుచుకుంది కమల.

–పి.వి.మురళీకృష్ణ

ఎదిగి ఎమ్మెల్యే అయ్యాడు. జిల్లాల్లో ఎమ్మెల్యేలనందర్నీ గుప్పెట్లో పెట్టుకుని మంత్రి పదవి చేపట్టాడు. సుబ్రమణ్యం అంటే ఆయనకి చాలా ప్రేమ. 'ఆ పల్లెటూళ్ళో ఎందుకుంటున్నావురా ఏదోక వుద్యోగం వేయిస్తాను హైదరాబాద్ వచ్చేయ్!' అని ఎన్నోసార్లు అన్నాడు కూడా. తన చదువుకి గుమస్తా జాబ్ కూడా రాదు. అంతకంటే చిన్న వుద్యోగంలో చేరి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తాకట్టుపెట్టడం సుబ్రమణ్యానికి ఇష్టం లేకపోయింది. ఉన్న పొలం చేసుకుంటూ తండ్రికి చేదోడు వాదోడుగా వూళ్ళోనే వుండిపోయాడు. వాళ్ళ వూళ్ళో మృత్యుంజయరావుకి ఓటు బ్యాంకు సుబ్రమణ్యమే. ఎన్నికలప్పుడు అన్ని పనులూ తనే నెత్తిన వేసుకునేవాడు. చిన్నాన్న గెలుపు కోసం రాత్రింబగళ్ళు కష్టపడేవాడు. ఆ చుట్టు ప్రక్కల ఎక్కడ మీటింగు పెట్టినా లారీలు తెచ్చి జనాన్ని చేరవేసేవాడు.

ఆ అభిమానం వుండబట్టే సుబ్రమణ్యం ఫోన్ చేయగానే 'ఇంటికి వచ్చేసెయ్! హోటల్లో దిగావా? ఎందుకు దిగావు? మన ఇంట్లో ఖాళీ లేదా?' అని మందలించాడు మంత్రిగారు.

తన వెంట ఒక స్నేహితుడు వున్నాడనీ, అందుకే లాడ్జిలో బస చేయాల్సి వచ్చిందనీ సంజాయిషీ చెప్పుకున్నాడు.

విశ్వనాథం చెప్పిన వివరాలు, అతని అప్లికేషను వగైరా ఫైల్లో పెట్టుకుని మంత్రిగారి ఇంటికి వెళ్ళాడు సుబ్రమణ్యం.

"రా...రా...! సుబ్రమణ్యం. ఊళ్ళో అంతా బాగున్నారా? మీ అమ్మ ఎట్లా వుంది? కోడలు, పిల్లలు కులాసానా?" అంటూ కుశలప్రశ్నలు వేశాడు మృత్యుంజయరావు.

అన్నిటికీ జవాబులు చెప్పి కూర్చున్నాడు సుబ్రమణ్యం.

సుబ్రమణ్యం వంక, అతని చేతిలోని ఫైలు వంక చూశాడు మంత్రిగారు.

"ఏమిటి సంగతి? నాతో ఏమైనా అర్జెంట్ పని వుందా? చెప్పు. తొమ్మిదింటికి ఒక మీటింగ్ వుంది" అన్నాడు వాచీ వైపు చూస్తూ.

"అవును చిన్నానా! నా క్లాస్‌మేట్ విశ్వనాథం. వాడికొక పని బడింది. వాడికి హైదరాబాద్‌లో పోస్టింగ్ కావాలి" అంటూ ఫైలు అందించాడు సుబ్రమణ్యం.

మంత్రిగారు ఫైలు అందుకుని పరిశీలించాడు.

"అతను మన కులంవాడేనా?" ప్రశ్నించాడు మంత్రిగారు.

"అవును."

"పెద్ద ప్రాబ్లమ్ అయిపోయిందిరా సుబ్రమణ్యం. ఈ మధ్య మనవాళ్ళందరికీ పోస్టింగ్స్ ఇప్పించాను. మంత్రిగారు అంతా తన కులం వాళ్ళతో డిపార్ట్‌మెంట్ నింపేస్తున్నాడని గోల గోలగా వుంది. కొందరైతే పి.ఎం.గారి చెవిన కూడా వేశారు."

పది నిముషాల సేపు అదే గొడవ వివరంగా చెప్పాడు.

మంత్రిగారి పరిస్థితి చూసి 'అయ్యో! పాపం ఎన్ని కష్టాలో' అని ఫీలయ్యాడు సుబ్రమణ్యం.

ఎంతవారికైనా కష్టాలే ఈ పాడు ప్రపంచంలో.

అందుకే పీత కష్టాలు పీతవి అన్నాడు శ్రీశ్రీ.

"ఇతగాడు మన నియోజకవర్గంవాడు కూడా కాదు అవునా?"

సుబ్రమణ్యం కాదన్నట్టు తల వూపాడు.

"ఏదో మీ అందరి సహకారం వల్ల నేను మంత్రినయ్యాను. మన నియోజకవర్గం వారి

పనులు చేయాల్సిన బాధ్యత నా మీద వుంది. అది గూడా అందరికీ, అన్నీ చేయలేమనుకో. మనకి చేతనైనవి చేస్తాం."

సుబ్రమణ్యం అయోమయంలో పడిపోయాడు. మంత్రిగారి ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదు. ఇంతకీ విశ్వనాథం పని చేస్తాడా? లేదా?

"సుబ్రమణ్యం, నువ్వేమనుకోకు. నువ్వు గూడా వచ్చేటప్పుడు వెనుకాముందూ చూసి రా. మనకి ఉపయోగపడేవాడికి, మనవాడనుకున్నవాడికి మనం సహాయం చేయాలి. గుర్తుంచుకో. నీ సొంత పని అయితే నువ్వు ఇక్కడిదాకా రానవసరం లేదు. ఫోన్ చేసి 'చిన్నానా! నాకీ పని కావాలని చెప్తే చాలు. నిముషాల్లో చేయిస్తాను. ఏమంటావ్?"

సుబ్రమణ్యం ఏమంటాడు?

తల వూపాడు.

"హైదరాబాద్‌లో పోస్టింగ్ అంటే మాటలు కాదు. చాలా కాంపిటీషన్ వుంటుంది. వెధవది ప్రతివాడికీ హైదరాబాద్‌లోనే పోస్టింగులు కావాలి. మనం ఒకడికో, ఇద్దరికో చేయించగలం. అందరికీ చెయ్యలేం గదా! అసలు అటెండర్ నుంచి ఆఫీసరు వరకూ అంతా హైదరాబాద్‌లోనే వుద్యోగం కావాలంటారు. అదేమంటే పిల్లల చదువులంటారు. అందరూ హైదరాబాద్ చేరాలంటే ఎట్లా? మిగతా రాష్ట్రమంతా ఏమైపోవాలి? ఎడారై పోవాలా? రోజూ పదిమంది వస్తారు పోస్టింగ్ పైరవీలతో. చస్తున్నాననుకో. నీకో సీక్రెట్ చెప్పనా! ఇప్పుడు నా మాటంటే మా డిపార్ట్‌మెంట్లో ఆఫీసర్లు లెక్కజేయడం లేదు. వాళ్ళేమో ఐ.ఎ.ఎస్. చదివినవాళ్ళు. రూల్ రూల్ అంటారు. జోన్ జోన్ అంటారు. ఆ జోన్ వాడు ఈ జోన్‌లోకి రాకూడదంటారు. ఈ జోన్ వాడు అటు కాలు బెట్టగూడదని రూల్సు అంటారు. నా కదంతా అర్థమై చావదు. వాళ్ళగొడవ వాళ్ళది. నేనేమో వచ్చిన వాళ్ళందరికీ పని చెయ్యమని రికమండేషన్ చేస్తున్నాను. వాళ్ళుమాత్రం ఎందరికని చెయ్యగలరు. రూల్స్ ప్రకారం చెయ్యలేనివి వుంటాయి. ఇప్పుడు నువ్వొచ్చావు. నీ ఫ్రెండ్ పని చెయ్యమన్నావు. నేను కాగితం మీద పరపరా రాస్తాను. ఏం లాభం? అక్కడ పనిగాదు. మంత్రి రాస్తే గొప్పేమిటయ్యా! ఆ మంత్రి ఇయ్యాల వున్నాడు. రేపు పోతాడు. రూల్సు ఎప్పుడూ వుంటాయి. ఎవడైనా కోర్టుకెళ్తే మా ప్రాణాలమీదకి వస్తుందని తిప్పికొడుతున్నారు. ఇదంతా ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదు. మనవాడివని నీకు చెప్తున్నా! నువ్వు నన్ను బాగా అర్థంచేసుకో. నేను రాసినా పని కాదు. నీ ఫ్రెండ్‌కి ఎట్లాచెప్పుకుంటావో అదంతా నీమీద వదిలేస్తున్నా."

> **గుర్తుగా**
>
> "నిన్న మా ప్రేమకు గుర్తుగా ఆ మధూ నేనూ ఉంగరాలు మార్చుకొన్నాం. కానీ నేను మోసపోయాను."
>
> "మోసపోయావా!"
>
> "అవును. నాది బంగారు వుంగరం. కానీ అతనిది బంగారం కాదు. నకిలీ ఉంగరం."
>
> – వి. మల్లిఖార్జున్

మంత్రిగారు చెప్పిందంతా విని సుబ్రమణ్యం తల తిరిగిపోయింది.

ఈ లోపల ఎవరెవరో వచ్చారు.

హడావుడీ మొదలైంది.

కారొచ్చి పోర్టికోలో ఆగింది. గన్‌మేన్ ముందు సీట్లో కూర్చున్నాడు.

మంత్రిగారు వెనుక సీట్లో కూర్చున్నాడు.

అనుచరులు రెండు కార్లలో ఫాలో అయ్యారు.

కార్లు తుర్రుమన్నాయి.

సుబ్రమణ్యం ముఖం వ్రేలాడేసుకుని లాడ్జికి తిరిగి వచ్చాడు.

అతని ముఖం చూసి వెళ్ళిన పని కాలేదని ఇట్టే గ్రహించేశాడు విశ్వనాథం.

***

ఆరు నెలలు గడిచాయి.

బంధువుల ఇంట్లో పెళ్ళికి హైదరాబాద్ వచ్చాడు సుబ్రమణ్యం. అనుకోకుండాబస్టాండ్ లోనే విశ్వనాథం కనిపించాడు.

"సుబ్రమణ్యం, ఎన్నాళ్ళకి కనిపించావు?" అని పలకరించాడు.

"అరే! విశ్వనాథం. బాగున్నావా? చాలా ళ్ళయింది నిన్ను చూసి. పిల్లలంతా ఎలా వున్నారు?" అని కుశలప్రశ్నలు వేశాడు సుబ్రమణ్యం.

ఇద్దరూ దగ్గర్లోని హోటల్లోకెళ్ళి కూర్చున్నారు.

"సారీవిశ్వనాథం. ఆ రోజు నీ పనిచేయించలేకపోయాను. నాకు గుర్తొచ్చినప్పుడల్లా బాధగా వుంటుంది" అన్నాడు సుబ్రమణ్యం.

"ఫరవాలేదోయ్! ఆ పని పూర్తయింది. నేనిప్పుడు హైదరాబాద్‌లోనే పని చేస్తున్నా. అమీర్‌పేటలో ఇల్లు తీసుకున్నాను. పద ఇంటికి పోదాం" అన్నాడు విశ్వనాథం.

సుబ్రమణ్యం షాక్ తిన్నట్లు చూశాడు.

"ఎట్లా అయింది పని?"

"మంత్రిగారే చేశారు!"

"వాట్? ఎవరితో చెప్పించావు? చీఫ్ మినిస్టర్‌తోగాని చెప్పించావా ఏం?"

విశ్వనాథం నవ్వాడు.

"నేనప్పుడు నీ ద్వారా మంత్రి దగ్గరికి వెళ్ళకుండా వుండాల్సిందోయ్. రాంగ్ రూట్ అని తర్వాత గ్రహించాను. సరైన రూట్‌లో వెళ్ళాను. సక్సెస్."

"సరిగా చెప్పు, నాకేం అర్థంకావడం లేదు."

"మంత్రి నీకు బంధువు. నీ ద్వారా ఏమీ ఆశించలేరు. మంత్రుల దగ్గర పనులు చేయించడానికి కొందరు పైరవీకారులు వుంటారు. వాళ్ళు నమ్మిన బంటుల్లా వ్యవహరిస్తుంటారు. మంత్రులు వాళ్ళ ద్వారా వచ్చిన పనులే చేస్తుంటారు. అవే గిట్టుబాటుగా వుంటాయి. ఆ చిదంబర రహస్యం తెలియక నిన్ను పట్టుకున్నాను. అసలు ఈ రోజుల్లో మహాలక్ష్మి మహిమ లేకుండా పనులవుతాయని అపోహ పడడం నా అజ్ఞానం."

"ఇంతకీ నీకు మంత్రి దగ్గర పని చేయించిందెవరు?"

"పాపారాయుడు. అతని ద్వారానే మంత్రి పనులు చేస్తుంటాడు. నీకీ విషయం తెలియదా?" అన్నాడు విశ్వనాథం.

పనీపాటా లేకుండా బజార్ల వెంట బలాదూర్ తిరిగే పాపారాయుడు మంత్రితో పనులు చేయించగలగడమూ, తను బంధువై వుండి చేయించలేకపోవడమూ సుబ్రమణ్యానికి బాధ కలిగించింది.

తెలీదన్నట్టు తల వూపాడు సుబ్రమణ్యం.

విశ్వనాథం అతన్ని జాలిగా చూశాడు. ●